# మలేషియాలో మన తెలుగువారు

ఆగస్టు నెలలో అమెరికా ప్రయాణం అనుకొని మూటముల్లె కడుతూ ఆ ప్రయత్నాల్లో నేనుండగా, అనుకోని విధంగా, ఒకరోజు సాయంకాలం "అలా ఓసారి బజారువైపు వెళ్లివస్తా"నంటూ బైలుదేరిన శ్రీవారు తిన్నగా వీధిగుమ్మమైనా దిగకుండానే చేతిలో ఏదో కాగితం పట్టుకొని ఇంటికి తిరిగి వచ్చారు. "ఈ సారికి అమెరికా ప్రయాణానికి బదులుగా మలేషియా వెళ్తే ఎలా ఉంటుందంటావు" అన్నారు చేతిలో ఉన్న కేబిల్ (అది ఆ దేశం నుండి వచ్చిన జాబ్ ఆఫర్) నా ముందు పడేస్తూ.

"బ్రహ్మాండంగా ఉంటుంది అంచక్కా సింగపూర్‌లో ఆగి మంచి నైలెక్స్, ఊలీ జార్జెట్ చీరెలు కొనుక్కురావచ్చు" అన్నాను ఉత్సాహంగా.

"మొత్తానికి ఆడదాన్ననిపించుకొన్నావు అన్నారు అదోలా చిన్నగా నవ్వుతూ

ఆ నవ్వు చూస్తే నా కొళ్లు మండుకొచ్చింది. చెప్పొద్దూ! ఎన్ని దేశాలు తిరిగినా, ఏ చదువులు చదివినా, "ఉమెన్ లిబ్" అనీ – అదనీ, ఇదనీ ఏయే రాతలు రాసినా మీ ఆడవాళ్లంతా ఇంతే. చీరలు, నగలు దగ్గరకి వచ్చేసరికి ఇట్టే తేలిపోతారు. అవి తప్పిస్తే ప్రపంచంలో ఇంకే విషయం పట్టవు అన్నట్లుంది ఆ నవ్వు.

"సింగపూర్‌లో చీరెలు చవగ్గా వస్తాయి కదా మంచి రంగుల్లో చూసి ఒకటో, రెండో డజన్లు తీసుకొంటే నేను కట్టుకోడానికైనా, లేకపోతే దేశం తిరిగి వచ్చాక ముచ్చటపడ్డవారికెవరికైనా ఇయ్యడానికైనా ఉంటాయి – అని ఆశపడి నేనామాట అంటే, "మొత్తానికి ఆడదాన్ననిపించుకొన్నావు" అంటూ అంతలా ఈసడించి పారేసారే మరి మీ మగాళ్లు మాత్రం ఎగబడ్డం లేదూ – డ్యూటీ ఫ్రీ షాపులు చూసేసరికల్లా ఫారిన్ లిక్కర్ల కోసం సిగరెట్ల కోసం" అన్నాను మనసులోని అక్కసు ఇంక పట్టలేక.

ఇదే ఇంకో రోజైతే మలేషియా ప్రయాణం మాట ఎలా ఉన్నా పై విషయాలు మీద మా ఇంట్లో ఓ చిన్న సైజు సివిల్‌వార్ లాంటిది మొదలై ఉండేది. కాని ఆ రోజు శ్రీవారు వాదులాటకి తగిన 'మూడ్'లో లేరు. అనుకోని విధంగా కొత్తదేశం మలేషియా చూసే అవకాశం వచ్చిందన్న ఉత్సాహంలో వున్నారు. "ఆల్‌రైట్ నా మాటని ఉపసంహరించుకొంటున్నాను. ఇంక గుర్రాన్ని కాస్త కట్టెయ్" అన్నారు రాజీ ధోరణిలో.

అదిగో – ఆనాడు అలా మొదలైన మా మలేషియా ప్రయాణం ఆ తరువాత రెండు నెలలనాడు, మద్రాసు మీనంబాకం విమానాశ్రయంలో ఎక్కిన ఎయిర్ ఇండియా విమానం క్షేమంగా మమ్మల్ని "సుబాంగ్" ఎయిర్‌పోర్ట్‌లో దించడంతో కార్యరూపం ధరించింది.

పాస్‌పోర్టు, వీసా, కస్టమ్స్ తనిఖీలు వంటి తతంగం ఉంటుంది. కాబట్టి విదేశ ప్రయాణం అని అనుకోవడమేకాని, కాలాన్ని, దూరాన్ని బట్టి చూస్తే మద్రాసు నుండి విమానంలో

హైదరాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్లినంతసేపు పట్టదు మలేషియా ప్రయాణం. ఓ నాలుగువేల రూపాయలు మనవి కావనుకొంటే చాలు మలేషియాకి ఓ ప్లెజర్ ట్రిప్ కొట్టిరావచ్చు. అయితే ఈ సొమ్ము రానూ, పోనూ ప్రయాణ ఖర్చుల వరకే సుమండీ. ఆ వెనుక ఇక్కడ తిండి తిప్పలకీ, తిరగడానికి, ఇంకా షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోనూ, సూపర్ మార్కెట్లల్లోనూ కళ్లు చెదరకొట్టేలా కనిపించే దేశ, విదేశ వస్తువుల్నీ, బట్టల్నీ కొద్దో గొప్పో కొనుక్కుపోవడానికి, హిల్టన్, జయాపూరీ, హాలిడేడెన్ వంటి పెద్ద పెద్ద హోటళ్ళలో విందు వినోదాలు ఆరగించడానికి, అనుభవించడానికీ డాలర్లలో మదుపు పెట్టగల ఏ బంధువునో, స్నేహితుణ్నో వెతుక్కోవాలి మరి. (ప్రస్తుతం ఉన్న మారకపు రేటు ప్రకారం మన నూరు రూపాయలకి రమారమి ఇరవై తొమ్మిది మలేషియన్ డాలర్లు వస్తాయి)

మలేషియాకి రాజధాని కోలాలంపూర్, మలైభాషలో 'కోలాలంపూర్' అంటే బురదగుంట అని అర్థంట. ఒకానొకప్పుడు ఈ ప్రదేశపు రూపురేఖలు ఎలా ఉండేవో ఈ పేరు ద్వారా మనం ఊహించుకోవచ్చు. కాని ఈనాడు మనకి కన్పించే కోలాలంపూర్ నగరం బురదగుంట కాదు, సారవంతమైన ఆ బురదలోంచి పుట్టుకొచ్చిన అరవిరిసిన పద్మంలా – అందమైన అధునాతన కట్టడాలతో, పెద్ద పెద్ద షాపింగ్ సెంటర్లతో, సూపర్ బజార్లతో, రోడ్లపై చీమలబారుల్లా వరుసలు తీరి సాగిపోతుండే రంగురంగుల కార్లతో ఓ మహానగరంగా కన్పిస్తుంది.

మూరిస్ పద్ధతిలో కట్టబడ్డ రైల్వేస్టేషన్, జనరల్ పోస్టాఫీస్, సెక్రటేరియట్, క్లాక్‌టవర్, రైల్వే ఎడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వంటి పురాతన కట్టడాలు కొన్ని ఉన్నప్పటికీ గడిచిన చరిత్రలోని ఘనత చాటుకొనే చారిత్రాత్మక ప్రదేశాలు, సంస్కృతీ చిహ్నాలు ఈ నగరంలో పెద్దగా ఏమీ కనిపించవు. ఈ నాటి దేశ ఆర్థికాభివృద్ధికి, పురోగమనానికి చిహ్నాలుగా నిలిచే అధునాతన కట్టడాలు – పార్లమెంటు హౌస్, నేషనల్ మాన్యుమెంటు, నేషనల్ మాస్క్, నేషనల్ మ్యూజియం వంటివి కోలాలంపూర్ నగరానికి కొత్త శోభని సంతరించిపెడ్తున్నాయి.

ఒక విధంగా చెప్పాలంటే అత్తింటితో వేరుపడి మొట్టమొదటి సారిగా కొత్తకాపురం పెట్టుకొన్న అమ్మాయి మనస్థితిలా ఉంటుంది. కోలాలంపూర్ వాతావరణం, గృహ నిర్వహణకి ఏది అవసరం అయితే దానిని కొనుక్కోమని భర్త చేతిలో డబ్బయితే పోశాడు కాని, ఆ డబ్బుతో ఏవి ముందుగా కొనాలి? ఆ కొన్న వస్తువుల్ని అందంగా ఎలా అమర్చుకోవాలి? అవి పాడుకాకుండా, పరాధీనమైపోకుండా ఎలా కాపాడుకోవాలి? కొత్తగా స్వతంత్ర జీవనంలో అడుగుపెట్టిన అమ్మాయికి అన్నీ సమస్యలే అన్నీ సంశయాలే. ఈనాడు మలేషియా ప్రభుత్వం, ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితి కూడా రమారమి ఇటువంటిదే.

"దేశమంటే మట్టికాదోయి – దేశమంటే మనుషులోయి" అన్నాడు మహాకవి గురజాడ. కాని, మలేషియా విషయంలో చూస్తుంటే ఈ దేశంలో నివసిస్తున్న మనుషుల గురించి కంటే – వారి మనుగడకే, ఈనాటి దేశ ఆర్థిక ప్రగతికి, పురోభివృద్ధికి మూల కారణమైన మన్ను గురించే ఎక్కువగా చెప్పుకోవలసి ఉంటుందేమో అనిపిస్తుంది.

భూమధ్యరేఖకి దగ్గరగా ఉండటంచేత ఈ దేశంలో మనకున్నట్లు వేసవికాలం, వర్షాకాలం, చలికాలం అంటూ మూడు వేరువేరుకాలాలు లేవు. పెద్దగా శీతోష్ణస్థితి బేధాలు కూడా ఉండవు. ఏడాది పొడుక్కీ రమారమి కాలమొక్కలాగే ఉంటుంది. పగటిపూట బైటకి వెళ్తే ఎండ చుర్రుమని తగులుతుంది. కాని, ఇంట్లో ఉంటే పెద్దగా వేడనిపించదు. ఎండ తీక్షణత కనిపించదు. పగలు ఎంత ఎండకాచినా రాత్రులు చల్లగా ఉంటాయి. దోమలబాధ లేకపోతే పాన్ వేసుకోవలసిన అవుసరం సాధారణంగా ఉండదు.

ఇక్కడా వర్షపాతం చాలా ఎక్కువగా ఉంటుది. ఒక కాలం, ఒక నెలా అని కాక సంవత్సరం పొడుక్కీ ఏదో ఓ సమయంలో వర్షాలు పడ్తూనే ఉంటాయి. అయితే అవి ముసురులాగో, జడివానలాగో కురిసి మనుషుల్ని బాధపెట్టవు. ఒక అరగంటో, గంటో ఆకాశంలో చిల్లులుపడ్డట్లు అడ్డూ ఆపూ లేకుండా ఉరుములతో పిడుగులతో అట్టహాసంగా కురిసి మళ్లా అంతలోనే తెరిపి ఇచ్చేస్తుంది. ఆ వర్షం కురిసిన సమయం పగటిపూట అయితే వెంటనే ఎండ కూడా వచ్చేస్తుంది. సాధారణంగా ఒక రోజు సాయంకాలం వర్షం వచ్చిందంటే, వారం పదిరోజుల పాటు సరిగా అదేవేళకి టంచనుగా వర్షించి తీరుతుంది.

ఇంతగా వర్షాలు పడ్డం వల్లనేమో నగరం దాటి నాలుగు మైళ్లు పోయేమంటే ఎక్కడ చూసినా ఏపుగా పెరిగిన చెట్లు చేమలతో ఎంతో అందంగా కన్పిస్తాయి పరిసరాలు. రబ్బరు, ఆయిల్‌పామ్ తోటలు ఎకరాలకి ఎకరాలు పరచుకొని చూడ ముచ్చటగా వుంటాయి. రబ్బరు చెట్లు సన్నగా, పొడుగ్గా తెల్లటి బెరడుతో, చిన్న ఆకులతో రివటల్లాంటి పలవలతో వుంటాయి. తెల్లని ఆ బెరడు తెగకొట్టి, మూసుకి గాట్లుపెట్టి, అందులోంచి కారిన రబ్బరు పాలతో రబ్బరు తయారు చేస్తారు. ప్రపంచపు మొత్తం రబ్బరు ఉత్పత్తిలో రమారమి సగభాగం మలేషియా రబ్బరుతోటల్లోంచే లభ్యమౌతోందిట.

ఈ దేశానికి విదేశ ద్రవ్యం కూడబెట్టే వనరుల్లో ఆయిల్‌పామ్ ఒకటి. ఈ మొక్కలు చూడ్డానికి లేత కొబ్బరి మొక్కల్లా గుజ్జుగా పొట్టిగా ఉంటాయి. బారులు తీర్చువేసిన ఆయిల్‌పామ్ తోటల్ని దూరం నుండి చూస్తుంటే తెలియనివారు కొబ్బరితోటలని భ్రమపడే అవకాశం లేకపోలేదు. అయితే ఈ మొక్కల మట్టలు కొబ్బరిమట్టలంత పెద్దవిగా ఉండవు – ఈత మట్టలంత చిన్నవిగానూ ఉండవు. పరిమాణంలో రెండింటికి మధ్యగా ఉంటాయి. ఈ మట్టల మధ్య నారింజ పండురంగులో చిన్న చిన్న కాయలు గుత్తులు గుత్తులుగా వేలాడుతుంటాయి. ఈ కాయల్ని చితక్కొట్టి, వుడకపెట్టి నూనె తీస్తారుట. సబ్బులు, వార్నీసులు వంటి చాలా వస్తువులు ఉత్పత్తిలో పామ్ ఆయిల్ ఎక్కువగా ఉపయోగపడ్తుంటుంది.

ఈ దేశపు భూభాగంలో రమారమి మూడొంతులకి పైగా భూమిని అడవులే ఆక్రమించుకొని వున్నాయి. పెద్ద పెద్ద మొదళ్లతో నూట ఏభై, రెండు వందల అడుగులు

ఎత్తువరకూ పెరిగే చెట్లతో దట్టంగా నిండి వుంటాయి ఈ అడవులు. ఈ మావి కలప కూడా మలేషియాకి విదేశీ ద్రవ్యాన్ని ఆర్జించిపెడ్తోంది.

ఈ చెట్టు చేమలే కాక మలేషియా వాసులకు ప్రకృతి ప్రసాదించిన ఇంకోవరం 'టిన్' చాలా ప్రదేశాల్లో ఈ ఇనుప ఖనిజం అట్టే లోతుకి పోనవసరం లేకుండా భూమి పై పొరల్లోనే లభ్యమౌతుంటుంది. ఎవడో కంట్రాక్టరు కొత్తరోడ్డు వెయ్యడానికి పని గుత్తకి తీసుకోగా, ఆ కంట్రాక్టు వల్ల వచ్చిన లాభంతోకాక ఆ తవ్వకంలో బైటపడ్డ ఇనుపరాయితో అతడు కోటీశ్వరుడు అయ్యాడని చెప్తుంటారు ఇక్కడి వాళ్లు. పల్లెపట్టుల్లో కూలీ నాలీ జనం పారతో చుట్టుపక్కల నేల తవ్వి, ఆ మన్ను బుట్టలు పైకెత్తి, నీటితో కడిగి, మన్ను కరగిపోగా మిగిలిన ఇనుమును దొంగతనంగా అమ్ముకొని డబ్బు చేసుకొంటుంటారట. ఊరు దాటిపోతుంటే భూమిపైపైనే పరచుకొని ఉండే ఇనుప గనుల్ని చూస్తుంటే పైమాటలో కొద్దిగానైనా నిజముండకపోదనిపిస్తుంది, మనలాంటి కొత్తవారికి. ఇంకా మనిషి అడుగుమోపని ప్రదేశం – గడ్డపార సోకని నేల ఎంతో మిగిలిందట భూగర్భంలో. తన ప్రజల కోసం ప్రకృతి ఇంకా ఏయే నిక్షేపాలు దాచి ఉంచిందో, అవి ఎంత పెద్ద పరిమాణాల్లో ఉంటాయో ఎవరూ చెప్పలేరు.

ఇటీవల కాలంలో ఈ దేశవాసులకు కొత్తగా లభ్యమైన ఇంకో సంపద ఆయిల్. ఈ పెట్రోలు కరువు రోజుల్లో మలేషియా రోడ్లమీద తిరుగులాడే కార్ల సంఖ్యని చూస్తుంటే, పెరిగిపోయిన పెట్రోలు ధరకి తట్టుకోలేక ఉన్న కారుని షెడ్‌లో పెట్టి బస్సుల మీద, రైళ్లమీద తిరుగులాడే మనబోటి వారికి అసూయగా ఉండకతప్పదు. చేతినిండుగా విదేశీ ద్రవ్యం వుండడంచేత ప్రపంచపు ఏ కొన నుండి ఏ వస్తువు కొనాలనుకొన్నా దిగుమతి చేసుకొనే అవకాశం వీరికి ఉంది. అంతేకాక విదేశీ పెట్టుబడి సంస్థలెన్నో ప్రభుత్వ నిబంధనలకి లోబడి తమ కార్ఖానాలని ఈ దేశంలో ఏర్పాటు చేసుకొని వస్తోత్పత్తి జరుపుకొంటున్నాయి.

మనదేశంలో ఒక అంబాసిడర్ కారో, ఫియెటో కొనుక్కోవాలనుకొంటే, దానికి ముందుగా అప్లికేషన్ పెట్టుకోడం, ఆ వెనుక క్యూలో వుండడం బోలెడంత తంతు. అలా వేచి ఉండగా ఏ ఆరునెలలకో, ఏడాదికో మనకి నచ్చని రంగులో వున్న కారు మన పాలబడ్తుంది. ఇక్కడ అటువంటి బాధలేం లేవు. కావలసిన కారు కోసం నెలల తరబడి వేచి వుండడం అన్న పద్ధతి అసలే లేదు. ప్యూజో, టోయాటో, డాక్సన్, ఫోర్డ్ అంటూ రకరకాల కార్లు ఆయా కంపెనీల షోరూమ్‌లలో కళ్లు ఆకట్టుకొనే రంగులతో తళతళ మెరుస్తూ మనల్ని ఆహ్వానిస్తుంటాయి. చేతిలో డబ్బుంటే చాలు (వాయిదా పద్ధతి మీద కూడా కొనుక్కోవచ్చు) మనం వెళ్లి ఏ మోడల్, యే రంగు కారు కావాలో ఎంచుకోవడమే తరువాయి – మరునాటికల్లా నెంబరు ప్లేటు తగిలించుకొని మన గుమ్మం ముందు వచ్చి నిలుస్తుంది మనం కోరుకొన్న కారు.

ఇక్కడ మధ్యతరగతి వారికి కూడా ప్రతిఇంట ఒక కారు విధిగా ఉంటుంది. అవసరాన్ని బట్టి ఒక కుటుంబానికి రెండు, మూడు కార్లు వుండడం కూడా అరుదుకాదు. అబ్బురపడవలసిన విషయం కూడా కాదు.

ఇంత ధనవంతమైన ఈ దేశపు సాంఘిక, రాజకీయ, భౌగోళిక పరిస్థితులు చూస్తే మాత్రం తమాషాగా ఉంటాయి. చాలాకాలం పాటు మనదేశం లాగే ఈ మలయా ద్వీపకల్పం కూడా బ్రిటీష్‌వారి ఆధీనంలో ఉంటూ వచ్చింది. 1963లో ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటి తొమ్మిది మలయా స్వదేశ సంస్థానాలు, నాలుగు బ్రిటీష్ సెటల్‌మెంట్స్‌తో కలసి మలేషియా ఫెడరేషన్‌గా 1965 ఆగస్టు 31 తేదిన అవతరించింది. మొదట్లో సింగపూర్ కూడా ఈ దేశంలో భాగంగా ఉంటూ వచ్చింది. కాని కొంతకాలం అయిన తరువాత అది స్వతంత్ర్యరాజ్యంగా వేరుపడిపోయింది. 130000 చదరపు మైళ్ల విస్తీర్ణం గల ఈ దేశం ఏకఖండంగా లేదు. తూర్పు, పడమర భాగాల్ని 400 మైళ్ల దక్షిణ చైనా సముద్రం వేరుచేస్తోంది.

ఈ దేశపు రాజ్యాంగంలో కొంత ప్రజాస్వామ్య పద్ధతి. కొంత రాచరికం కన్పిస్తుంది. ఫెడరేషన్‌లో భాగంగా ఉన్నప్పటికీ తొమ్మిది స్వదేశ సంస్థానాల సుల్తానులకు కొన్ని ప్రత్యేక హక్కులు, అధికారాలు, లాంఛనాలు ఉంటాయి. ఈ సుల్తానులంతా కలిసి ఒక నాయకుణ్ణి ఎన్నుకొంటారు. (తమ తొమ్మండుగురిలో ఒకడిని) ఈ ఎన్నిక అయిదేళ్ల కొకసారి జరుగుతుంటుంది. అలా ఎన్నుకోబడ్డ వ్యక్తి మలేషియా రాజ్యాధినేతగా ఉంటాడు. అతడిని 'యాంగ్ డి పర్టువాన్ అగాంగ్' అంటారు.

ఇంక పార్లమెంటుకి ఎన్నికలు – ఎగువసభ, దిగువసభ, వగైరా ప్రజాస్వామ్య పద్ధతి ఉంటుంది. పెరుదారన్ మంత్రి (ప్రధానమంత్రి) తన మంత్రివర్గాల్ని ఏర్పరచుకొని యాంగ్‌డి పర్టువాన్ అగాంగ్ గారి సహాయంతో రాజ్య నిర్వహణ చేస్తుంటాడు.

మలేషియా ముస్లిమ్ రాజ్యం. దేశ జనాభాలో సగానికిపైగా ఉండే 'మలై' జాతి వారంతా ఇస్లామ్ మతస్థులే. వీరిని 'భూమిపుత్రు'లని అంటారు. దేశంలో ఆర్థికంగా, సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడి ఉన్న జాతి వీరిది. వీరి పురోభివృద్ధికి ప్రభుత్వం ఎంతో పట్టుదలతో కృషి చేస్తోంది. మిగిలిన దేశవాసుల స్థాయికి వీరిని తీసుకురావడానికి ఎంతో సొమ్ము ఖర్చుచేసి వారికోసం ప్రత్యేక విద్యాలయాలు నెలకొల్పుతోంది. గవర్నమెంటు ఆఫీసుల్లో, ప్రైవేటు సంస్థల్లో, విదేశి కంపెనీలలో వీరికి విధిగా కొన్ని స్తానాలు కేటాయింపు ఉంటుంది. వీరి రక్షణకి, వీరి ప్రగతికి సోపానాలుగా ఎన్నో శాసనాలు చేస్తోంది. వాటిని అమలుపరుస్తోంది.

లావుపాటి ఎత్తు పెదవులు, పల్చని చెక్కిళ్లు, కోల ముఖాలతో కొద్దికొద్దిగా నీగ్రో మాంగోలాయిడ్ రూపుల కలగలుపుతో చామనచాయ రంగులో ఉంటారు. ఈ మలై జాతివారు. వారు మాట్లాడే భాషని 'బహాసా' అంటారు. ఇది ఈ దేశపు జాతీయ భాష, రాత రోమన్ లిపిలో ఉంటుంది.

ఈ దేశపు జనాభాలో రెండవ స్థానం ఆక్రమించుకొన్నవారు చైనీయులు. ఆర్థికంగా సాంఘికంగా దేశంలో మిగిలిన రెండు జాతుల వారి కంటే వీరు పైమెట్టులో ఉన్నట్లు కన్పిస్తుంది. దేశంలో వర్తక వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు చాలా భాగం వీరి చేతుల్లోనే ఉంటున్నాయి. ఆర్థిక, సాంఘిక, వివాహాది అన్ని విషయాల్లోనూ అతి దగ్గరగా తమలో తామే అల్లుకుపోయిన జాతి వీరిది. పచ్చని పసిమి రంగులో పొట్టిగా, పీలగా చిన్నకళ్లతో, అందంగా అలంకరించుకొన్న దుస్తులతో రోడ్లపై కన్పించే చైనావారి వయసుని, మనిషిని పోల్చుకోడం అన్నది ఓ పందెంగా పెట్టుకోవచ్చు. నడివయసు చేరుకొనేవరకు అంతా చిన్నవాళ్లలాగే కన్పిస్తారు. వీరు మాట్లాడే భాష మాండలిన్.

మలేషియా జనాభాలో మూడో స్థానం ఆక్రమించుకొన్నది ఇండియన్స్. వీరిలో ఎక్కువ శాతం తమిళులు. ప్రభుత్వ పరంగా గుర్తింపబడిన మూడు దేశ భాషల్లో తమిళం ఒకటి. రేడియో, టెలివిజన్, కార్యక్రమాలు మూడు భాషల్లోనూ (బహాసా, మాండరిన్, తమిళం) ఉంటాయి. దేశంలో జరుపుకొనే పండుగల్లో హరిరాయాపునాసా (మలైవారి పండుగ) చైనీస్ న్యూ ఇయర్‌డే, దీపావళి ముఖ్యమైన పండుగలుగా గుర్తింపబడ్డాయి. తమిళంలో వెలువడే దినపత్రికలు, పుస్తకాలు బజార్లలో కన్పిస్తుంటాయి. తమిళ సినిమాలు ప్రదర్శింపబడుతుంటాయి. కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో తమిళం ఉండే షాపుల సైన్‌బోర్డులు, హోటళ్లు విరివిగా కన్పిస్తుంటాయి. కాని, దేశం మొత్తం మీద ఏభైవేలకి పైగా తెలుగువారు ఉన్నా దేశంలో తెలుగువారికి, తెలుగుభాషకి గుర్తింపు ఉన్నట్లు అగుపించదు. అసలు తెలుగువారికి వారిది అయిన వేరే సంస్కృతి, భాషా ఉన్నట్లే ఇక్కడ చాలామందికి తెలియదు. ఇండియన్స్ అంటే తమిళులే అని వారి అభిప్రాయం. ఇండియా నుండి వచ్చిన మాకు తమిళం రాదంటే వింతగా చూసి, "అయితే మీరు మరే భాష మాట్లాడుతారు?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నిస్తారు.

ఈనాటి తెలుగువారి ఈ వెనుకబాటుతనానికి పూర్వచరిత్ర కొంత లేకపోలేదు. మొట్టమొదటగా ఈ దేశానికి వలస వచ్చిన తెలుగువారు విద్యావంతులూ, పై వర్గాలకి చెందినవారూ కారు. చాలవరకు నిరక్ష్యరాస్యులు. కాయ కష్టం చేస్తూ బ్రతికే కూలినాలీ వర్గానికి చెందినవారు మలేషియాలో కాలుపెడ్తూనే వారికి కనిపించిన జీవనోపాధి అవకాశాలు రబ్బరు, ఆయిల్‌పామ్ తోటల్లో, కొంతమందిని కేవలం వాటిల్లో పనిచేసే నిమిత్తం తోటల యజమానులే రప్పించుకుంటూండేవారు. మరికొంత మంది బ్రతుకుతెరువు కోసం వారంతట వారే వచ్చిన వారు ఉన్నారు. రావడం ఏ విధంగా వచ్చినా ఆనాడు వారికి తిండి, ఆశ్రయం ఇచ్చి ఆదరించినవి రబ్బరు, ఆయిల్‌పామ్ తోటలు. వాటి యజమానులు తమ పనివారి కోసం ప్లాన్‌టేషన్స్‌లోనే ఇళ్లు కట్టించి ఇచ్చారు. ఇతరమైన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వారి పిల్లల చదువులకు ప్రాథమిక పాఠశాలలు ఏర్పరచారు. వారి కుటుంబాలు అనారోగ్యానికి గురి అయితే చికిత్సపొందడానికి వైద్య

సదుపాయాలు కలుగజేశారు. వారు ప్రార్థనలు, పూజలు జరుపుకోడానికి భజనమందిరాలు, కోవెల్లు కట్టించారు.

పై కారణాలన్నింటివల్ల తోటల్లో పనిచేసే వారికి ఆ తోటలు దాటి బైటకి రావలసిన అవసరం లేకుండా పోయింది. వారి జీవితాలు ఆ తోటలకే అంకితమైపోయాయి. వారి కార్యక్రమాలు సంస్కృతీ-సంస్కారాలు ఆ తోటల పొలిమేరలకే పరిమితం అయిపోయాయి. తమ పిల్లలు పెద్దవారైతే ఎక్కడికో దూరంగా పోతారన్న భయం వారికిలేదు. తగినంత చదువు సంధ్యలు లేకపోతే వారికి సౌకర్యాలు దొరకవన్న బెంగ వారికి లేదు. తలిదండ్రులు ముసలివారైపోతే పిల్లలు ఆ పనులు అందుకొంటారు. వారి తరువాత వారి పిల్లలు - ఆ పిల్లల పిల్లలు - ఇలా ఎన్నో తరాలు గడిచిపోయినా అంతా ఆ తోటలనే నమ్ముకొని బ్రతుకుతున్న తెలుగువారు ఎంతోమంది ఉన్నారు.

ఈనాటికి అటువంటి ప్లాన్‌టేషన్స్‌లో పనిచేస్తూ జీవితాలు వెళ్లదీస్తున్న వారి పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. వారి జీవితాలపై దేశంలో వస్తున్న ఆర్థిక, సాంఘిక, రాజకీయమైన మార్పుల ప్రభావం పడినట్లు అగుపించదు. మిగిలిన దేశవాసులతో, ముఖ్యంగా స్వజాతీయులైన తమిళులతో పోల్చి చూస్తే మలేషియా తెలుగువారు విద్యా, ఆర్థిక, సాంఘిక రంగాల్లో బాగా వెనుకబడి ఉన్నారనే చెప్పవలసి ఉంటుంది.

ఇక్కడ 'మలేషియా ఆంధ్ర సంఘం' అంటూ ఆంధ్రులకు ప్రాతినిధ్యం వహించే ఒక సంస్థ ఉంది. దానికి దేశం మొత్తం మీద పది పన్నెండు శాకలు ఉన్నాయట. అటువంటి వాటిలో ఒకటి అయిన 'ఆంధ్ర సంఘం సెలంగోరు శాఖ' జరుపుకొన్న పన్నెండవ వార్షికోత్సవాలకి ఇటీవలనే 'రవాంగ్' అనే పట్టణం వెళ్లడం జరిగింది. ఆ ఉత్సవాలకి రెండు, మూడు వందలకి పైగా తెలుగువారు వచ్చారు. ఈ పరాయిదేశమైన మలేషియాలో అంతమంది తెలుగువారిని ఒకచోట చూడగలగడం, వారితో మాట్లాడ్డం ఎంతో సంతోషం కలిగించింది.

ఆ ఉత్సవ కార్యక్రమంలో ఒక చిన్న పిల్ల "నీ జాతీ మరవొద్దూ, నీ భాషా విడువొద్దూ" అంటూ ఒక పాట పాడింది. ఆ పిల్ల ఆ పాట పాడుతూంటే అది పాటగా కాక ఆ చిన్నారి మనసులోంచి పొంగిపొరలుతున్న కోరికలా వినిపించింది నాకు. కాని తమ జాతి గురించి, తమ భాష గురించి తెలుసుకోడానికి ఇక్కడి తెలుగుబిడ్డలకున్న అవకాశాలేమిటి? తెలుగు చదువను, రాయను నేర్వాలనుకొంటే వారికి తగినన్ని పాఠశాలలు లేవు (కొన్ని ప్లాంటేషన్స్‌లో అక్కడివారి పిల్లల కోసం నడుపబడుతున్న ప్రాథమిక పాఠశాలలు ఏ కొద్దిగానో ఉన్నాయిట) ఏదో విధంగా మరిచిపోకుండా నిల్పుకోడానికి, అభివృద్ధి పరచుకోడానికీ అవసరమయే పత్రికలు, పుస్తకాలు అసలేలేవు. తెలుగుజీవితం గురించి, తెలుగుపలుకుబళ్ల గురించి తెలుగు సినిమాలైనా (వాటిలో ఉండే తెలుగుతనం నీతి బీరకాయలో నేయి వంటిదే అయినప్పటికీ) చూసే అవకాశం లేదు.

"మేము ఈ దేశంలో ఉంటున్న మన పండుగలు, ఆచారాలు, పూజలు ఏవీ వదులుకోమమ్మా" అంది ఒక ఇల్లాలు. ఏదో నా రచనలో ఇంగ్లీషు పదాలు ఎక్కువగా దొర్లాయని బాధపడ్డాడు ఒక మలేషియా తెలుగు సోదరుడు.

నిజం చెప్పాలంటే తెలుగుభాషపట్ల, తెలుగు సంస్కృతిపట్ల, ఆచార వ్యవహారాల పట్ల తెలుగుదేశపుగడ్డపై ఉండే మన కంటే ఈ ప్రవాసాంధ్రులకి ఎన్నోరెట్లు ఎక్కువగా అభిమానం, ఆదరం, గౌరవం ఉంది. వాటిని నిలుపుకోవాలనే కోరిక అభివృద్ధి పరచుకోవాలని ఉంది. ఉత్సాహం ఉంది. కాని వారి కోరిక నెరవేరడానికి తగినన్ని సదుపాయాలు ప్రస్తుతం ఇక్కడ ఉన్నట్లు కన్పించవు. ముందు ముందు ఏర్పడే సూచనలైనా పెద్దగా అగుపించడం లేదు.

అయితే ఈ ప్రవాసాంధ్రులు కోర్కెకోర్కెగా నిలచిపోవలసిందేనా? ఈ మొగ్గ పువ్వుగా వికసించి పరిమళాలు వెదజల్లకుండా మొగ్గలోనే మాడిపోవలసిందేనా?

ఎన్నో విద్యాసంస్థలకి ఉదారంగా విరాళాలిస్తూ పలువురికి విద్యాదానం చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం వారుకాని, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం వారు కాని పూనుకొంటే ఈ ప్రవాసాంధ్రుల బిడ్డలకి మాతృభాష నేర్చుకొనే అవకాశం కల్పించలేకపోతారా? తెలుగు నాట రచయితలు, రచయిత్రులు, పబ్లిషర్స్ మంచి మనసుతో ముందుకువస్తే, తమతమ రచనల్ని, ప్రచురణలని కనీసం ఒక్కొక్క కాపీ అయినా పంపి సహకరిస్తే ఈ దేశపు తెలుగువారికి ఒక చిన్న సైజు సంచార గ్రంథాలయమైనా ఏర్పాటు చేసుకొనే అదృష్టం కలగకుండా పోతుందా?

ఇందులో మొదటిది పెద్దగా డబ్బుతో కూడుకున్న పని. అది ప్రభుత్వపరంగా జరగవలసిన కార్యక్రమం. కాని రెండవది ఏమంత వ్యయప్రయాసలతో కూడుకొన్న విషయం కాదు. ఏ కొద్దిగానైనా భరించవలసి వచ్చినా ఒక మంచి కార్యానికి సహాయపడ్డామన్న తృప్తి అటువంటి వారికి మిగలకపోదు.